క్లుప్తంగా

16న జాతీయ లోక్ అదాలత్

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ తేదీని హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహణ తేదీని మార్చినట్లు జూనియర్ సివిల్ కోర్టు ఇన్ఛార్జ్ జడ్జి జ్యోతి తెలిపారు. మార్చి 9 తేదీన మహాశివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇదే రోజు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16కు మార్చినట్లు తెలిపారు. కక్షిదారులు,అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని జడ్జి తెలిపారు.

29న గంధ మహోత్సవం

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల మౌలా కాపహాడ్ వద్ద గురువారం గంధమహోత్సవం నిర్వహించనున్నట్లు మౌలాకాపహాడ్ సొసైటీ అధ్యక్షులు ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గంధ మహోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం గంధ మహోత్సవం సందర్భంగా అన్నదానం చేయన్నుట్లు చెప్పారు. రాత్రి దానిష్‌ఖాన్ ఖవ్వాలిచే సూఫీ ఖవ్వాలీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కలికిరి: సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ క్యాలెండర్లను సోమవరం తహసీల్దారు విజయకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యులకు వజ్రాయుధం లాంటిదని, ప్రజలకు ఈ చట్టంపై మరింత అవగాహన కల్పించడానికి సంస్థ కృషి చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీమన్నారాయణరెడ్డి, రామకొండారెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్, జ్ఞానేంద్ర, మురళి, కుమార్‌రెడ్డి, సయ్యద్ బాషా, ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా పోరుయాత్ర


పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు, కమ్మచెరువు, మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర నర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మల్లెం శివయ్య, మండలాధ్యక్షుడు, అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, నాయకులు గోపాల్‌రెడ్డి, శంకర్ మూర్తి, వెంకటనారాయణ, రమణ, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌సీసీ అవార్డుకు దేవకమ్మ ఎంపిక



మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు, అసోసియేటెడ్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పని చేస్తున్న గుర్రం దేవకమ్మ ఉత్తమ ఎన్‌సీసీ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. మార్చి 1న సికింద్రాబాదులోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు దేవకమ్మను అభినందించారు.

మల్లయ్యకొండకు 40 ఆర్టీసీ బస్సులు



ఆర్టీసీ డీఎం వెంకటరమణారెడ్డి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు 40 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు మదనపల్లె వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మల్లయ్యకొండ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిలు స్వాగతం పలికి పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో దర్శనం కల్పించారు. అనంతరం రోడ్డు సౌకర్యాన్ని ఆయన పరిశీలించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం సమీపంలో ఉన్న అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి సోమవారం నాకా బందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని పోతుపేట పంచాయతి పిడుంవారిపల్లికి చెందిన ఆర్.మంజునాథ్ (38) కర్ణాటక రాష్ట్రంకు చెందిన 40 మద్యం ప్యాకెట్లను అకమంగా బస్సులో తరలిస్తూ తనిఖీలో పట్టుబడ్డాడని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా నలవీరగంగా భవానీ తిరునాల

- అమ్మవారి బోనాలు సమర్పణ
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- జాతరకు పోలీసుల గట్టి బందోబస్తు



అమ్మవారికి బోనాలు తీసుకున్న మహిళలు

మదనపల్లె సిటీ: జిల్లాలో మొట్టమొదట జరిగే సీటీఎం నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తిరునాల అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం ఎదుట సిరిమానుకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సీటీఎం పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున బ్యాండు మేళాలతో బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారికి బోనాలు పెట్టారు. సారెను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయం ధ్వజస్తంబం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. ఆసాదులు అమ్మవారి కీర్తిస్తూ పాటలు ఆలపించారు. సీటీఎం గ్రామంలో జాతర వాతావరణం నెలకొంది. అమ్మవారి పుట్టినిల్లు మిట్టపల్లె నుంచి ప్రత్యేకంగా చీర, సారెను అందజేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం క్యూ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయం పరిసర ప్రాంతాలు షాపులతో నిండిపోయింది. జాతర పురస్కరించుకుని సీటీఎం సర్పంచు ఆనంద పార్థసారథి, తాలూకా సీఐ శేఖర్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతర పురస్కరించుకుని భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం పరిసర ప్రాంతాలు దుకాణాలతో నిండిపోయింది. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి తిరుణాల సందర్భంగా చాందినీబండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. కొందరు అన్నంబండ్లతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. జాతర పురస్కరించుకుని ఆర్టీసీ–2 డిపో ప్రత్యేక బస్సులు నడిపారు. జాతరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో నలవీరగంగాభవానీ

జగనన్న పథకాలు విజయానికి సోపానాలు



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సోపానాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రగుంట్లపల్లె, బాలంవారిపల్లె, కాకులారంపల్లె, దొడ్డిపల్లె, రేగళ్లు గ్రామ పంచాయతీలో విస్తృతంగా పర్యటించి గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు దాదాపు వందశాతం పథకాలు అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా కుల, మత, రాజకీయ వర్గబేధాలు లేకుండా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన పథకాలు ప్రతి ఓటరుకు గుర్తు చేసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు బాలం నరేంద్రరెడ్డి, చంద్రారెడ్డి, హరిణి, అమరనాథరెడ్డి, ఎస్.వి. చలపతి, రమేష్‌రెడ్డి, బుల్లెట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పీలేరు రూరల్ : స్థానిక నాగిరెడ్డి కాలనీలోని ఇండోర్ స్టేడియంలో రెండు రోజులపాటు పురుషుల విభాగంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతగా రాయచోటి జట్టు నిలచినట్లు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, నిర్వాహకులు డాక్టర్ వి.రామ్మోహన్ తెలిపారు. సోమవారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల క్రీడాకారులు రాయచోటి జట్టుకు మొదటి బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి పీలేరు జట్టుకు రూ. 7 వేలు, తృతీయ బహుమతి టి.సుండుపల్లెకు రూ. 5 వేలు, చతుర్థ బహుమతి మదనపల్లె జట్టుకు రూ. 3 వేలు తోపాటు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ మార్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడిరైతులకు అవగాహన కల్పిస్తున్న సుకుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బాలంవారిపల్లె, దొడ్డిపల్లె గ్రామాల్లో మామిడి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూత దశలో ఉన్న మామిడిని ఆశించే తేనె మంచు పురుగు నివారణకు బుప్రో ఫిజిన్, అసిఫేట్ ఒక గ్రాము గానీ పైమెట్రోజెన్ 0.6 గ్రాములు లీటర్ నీటికి కలపి పిచికారి చేయాలన్నారు. పిందె రాలకుండా ఉండడానికి తేలికపాటి నీటి తడి ఇవ్వాలన్నారు. పిందె ఎక్కువగా రాలుతుంటే ఒక మిల్లీ లీటరు ప్లానోఫిక్స్ మందుకు 4.5 లీటర్ల నీటిని కలపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో దరహాస్, రైతుల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహప్రతిష్ట, మహాభిషేకం చేశారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భవనం వెంకటరమణారెడ్డి, గాయం నాగభూషణంరెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి, గాయం మధుసూదన్‌రెడ్డి, అర్చకులు శ్రీనివాసదీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వాటర్ ప్లాంట్ సద్వినియోగం చేసుకోండి



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి నీటిని అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ ప్యారీజాన్

కలకడ : ఉచిత మినిరల్ వాటర్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కలకడ సర్పంచ్ ప్యారీజాన్, ఎంపీపీ శ్రీదేవి కోరారు. సోమవారం మండలకేంద్రమైన కలకడ తేరువీధిలో యండీసీ డైరెక్టర్ , వైఎస్సార్‌సీపీ నాయకులు హరీష్ రెడ్డి వితరణ చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ఉచిత నీటిని స్థానికులకు పంపిణీ చేశారు. శుద్ధిచేసిన మంచినీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో క్యాన్ వాటర్ కొనుగోలు చేయడంకంటే స్థానికులు ఎలాంటి మందులు కలపని మంచినీటిని ఉచితంగా తీసుకెళ్లే విధంగా ఆలయం సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్లాంట్ ఏర్పాటు చేసి వేసవిలో కలకడ ప్రజల దాహార్తిని తీర్చడానికి కృషి చేసినట్లు తెలిపారు. హరీష్‌రెడ్డి సేవలు గుర్తు పెట్టుకోవాలని, మంచివారిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, షౌకత్‌అలీఖాన్, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, సింగల్‌విండో డైరెక్టర్ సుల్తానిబాషా, వైఎస్సార్ సీపీ నాయకులు కుమార్ రెడ్డి, జిలానీ, బయన్న పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన అతిపురాతన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేజ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

కేశాలు దానం



కేశాలను అందజేస్తున్న గాయిత్రి

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోములో చిరునవ్వులు చిందించాలన్న ఆశయంతో హెల్పింగ్‌మైండ్స్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన గాయిత్రి కేశాలు దానం చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దనున్న హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో భర్త కృష్ణతో వచ్చి కేశాలను అందజేశారు. సంస్థ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ వీరికి మొక్కలు అందజేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు పురుషోత్తం, అజయ్, కిరణ్‌లు పాల్గొన్నారు.

రేపు బహుమతుల ప్రదానం

కలికిరి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటిన మండలంలోని క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అధ్యక్షతన బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కిలికిరి–2, కలికిరి–3, మేడికుర్తి, మహల్ క్రీడారాలున్నారని, ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవ్వాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

రాయచోటి అర్బన్ : నిబంధనలకు విరుద్ధంగా తక్కువ మైక్రాన్‌ల మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీమ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావులు హోటళ్ల యజమానులను హెచ్చరించారు. సోమవారం ఉదయం మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. హోటళ్లలోని ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతలను పరిశీలించారు.

అక్కదేవతలకు విశేష పూజలు



అక్కదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ కొత్తపల్లెలో అక్కదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు బాలకృష్ణ,కుమారి ఆధ్వర్యంలో అమ్మవారి పూజా సామగ్రిని బళ్లారి డ్రమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రత్యేకంగా అలంకరించిన బండిలో ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కదేవతలకు, బండి అన్నకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. పూజారి రామచంద్ర ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసమే రుణాలు



డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న మేనేజర్ హరినాథ్‌గుప్తా

తంబళ్లపల్లె: మండలంలోని వైఎస్సార్‌క్రాంతిపతం మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసమే బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంకు మేనేజర్ హరినాథ్‌గుప్తా తెలిపారు. సోమవారం స్త్రీ శక్తి భవన్‌లో మహిళా సంఘాల డాక్యుమెంటేషన్‌లను పరిశీలించారు. 24 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచనల మేరకు అర్హత ఉన్న మహిళా సంఘాలకు సీనియారిటీ ప్రాతిపదికన ఒక్కో సంఘానికి రూ.10లక్షల నుండి రూ.20లక్షల వరకూ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీయం గంగాధర్, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్యం

రాయచోటి అర్బన్ : కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకే కొమ్ముకాస్తున్నదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారంలో పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

– సర్‌ఖాజీ హాఫీజ్ ఇక్బాల్ సాహెబ్



ధార్మికోపన్యాసం చేస్తున్న ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్ సాహెబ్

మదనపల్లె సిటీ: ప్రవక్తమార్గం అనుసరణీయమని ప్రభుత్వ సర్ ఖాజీ హాఫీజ్ ఇక్బాల్‌సాహెబ్ అన్నారు. ముస్లింల పర్వదినమైన షబ్ ఏ బరాత్‌ను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇస్లాంలో షాబాన్ నెలకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. రంజాన్ నెలకు 15 రోజులు ముందు వచ్చే షబే బరాత్ రాత్రి పరమ పవిత్రమైనదన్నారు. ఈ రేయి ఎంతో మహిమగలదన్నారు. రాబోవు సంవత్సర కాలానికి మనిషి జీవితంలో సంభవించే పరిణామాలు అన్నింటినీ షాబాన్ రాత్రిలోని దైవం నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాపాలను ప్రక్షాళన చేసుకుని సన్మార్గంలో నడవడానికి ప్రయత్నించాలన్నారు. అనంతరం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వేకువజామున ముస్లింలు ఖబ్రస్థాన్‌కు వెళ్లి తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు.

ప్రజా సమస్యలకు సత్వరపరిష్కారం

– మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వరపరిష్కారం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుభాష్‌రోడ్డులో తాను నివాసం ఉంటున్న ఇంటి సంపులోకి మురికినీళ్లు చేరుతున్నాయని కృష్ణమూర్తి ఫిర్యాదుచేశారు. ముజీబ్‌నగర్‌లో నీటిసమస్య తీవ్రంగా ఉందని, పదిరోజులకు ఒకసారి నీళ్లు వదలడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని ముస్లిం మహిళలు ఫిర్యాదుచేశారు. విజయనగర్ కాలనీలో రోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాలు ఏర్పాటుచేయాలని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. ఇందిరానగర్‌లో వారానికి ఒకసారి నీరు వదులుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో ఏఈ బండపల్లిశిరీషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు విరివిగా రుణాలు



మాట్లాడుతున్న ఆర్‌ఎం ప్రసాద్

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంత ప్రజలకు విరివిగా రుణాలు అందించి అభివృద్ధికి కృషి చేస్తామని గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జీవీఎం ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎల్ఆర్‌వీధిలో ఉన్న గ్రామీణ బ్యాంకును కొత్తపేటవీధిలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖను 31 మార్చి 1999లో వాల్మీకిపురంలో ప్రారంభించామని, పట్టాభిరామాలయంతో తొలి ఖాతాను ప్రారంభించి, ప్రస్తుతం 16108 ఖాతాలతో రూ.173 కోట్లతో బిజినెస్ జరుగుతుందని తెలిపారు. వాల్మీకిపురం శాఖ ద్వారా ఇప్పటి వరకు రూ.57 కోట్లతో డిపాజిట్లు ఖాతాదారుల నుంచి సేకరించామన్నారు. ఎల్లవేళలా ఖాతాదారులకు సకాలంలో సేవలు అందిస్తామని, మహిళల ఆర్థికాభివృద్ధికి గ్రామీణ బ్యాంకు శాఖ వంద శాతం రుణాలు అందించి, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నూతన శాఖ ఖాతాదారులకు అత్యంత సౌకర్యవంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రభ హరణ్, మేనేజర్ సందీప్ కుమార్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు

- అమృత్ భారత్ స్టేషన్ పథకంలో వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని
- విభిన్నసంస్కృతులు, ప్రజలను ఏకంచేసేది రైల్వే వ్యవస్థ
- ఆర్డీఓ హరిప్రసాద్



మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు, రద్దీగా ఉన్న రైల్వేస్టేషన్లను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో ఎంపికవడంతో మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టిందని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్స్ రైల్వేస్టేషన్ వద్ద అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జరగనున్న అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి, సీటీఎం–2 పంచాయతీ అభివృద్ధి చైర్మన్ బి.అక్కులప్ప, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లెప్రశాంత్, జ్ఞానోదయ కామకోటిప్రసాదరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ...దేశంలో అతి ముఖ్యమైన రవాణా సాధనం రైల్వే వ్యవస్థ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత రద్దీ కలిగిన వ్యవస్థగా భారతీయ రైల్వేకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దేశంలోని విభిన్న సంస్కృతులు, ప్రజలను ఇండియన్ రైల్వేస్ ఏకం చేస్తోందన్నారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లు అభివృద్ధికి, 1,500 రోడ్ ఓవర్ బ్రిడ్జి, అండర్‌పాస్‌లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు రూ.41వేల కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. సీటీఎం రైల్వేస్టేషన్ ఈ పథకం కింద ఎంపిక కావడం ఇక్కడి ప్రజలందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. సమావేశంలో స్టేషన్ మాస్టర్‌లు కరుణాకర్, వెంకటేష్, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ రమణ, మనోహరదాస్, శ్రీధర్ పాల్గొన్నారు.